క్లుప్తంగా

భూ వివాదాల పరిష్కారానికి రీ సర్వే


ప్రగడవరంలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి : భూ వివాదాల పరిష్కారానికే రీ సర్వే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని ప్రగడవరం సర్పంచ్ భూపతి అన్నారు. మండలంలోని వెంకంపాలెం రెవెన్యూ సమీపంలో జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వేను ఆయన ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : నవోదయ ఎంట్రన్స్ పరీక్షల్లో గొల్లగూడెం ఎంపీపీ పాఠశాలలో చదివే ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు పంగం శ్రీనివాసరావు తెలిపారు. 5వ తరగతి చదువుతున్న ములకాల వర్షిణి, ములకాల దేవీ నందన ఉత్తీర్ణత సాధించి పెదవేగిలో ఉన్న గురుకుల విద్యాలయంలో సీటు సాధించారని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు.

కోచింగ్ తీసుకోకుండా...



కుక్కునూరు : మండలంలోని మారేడుబాక గ్రామంలో ఎంపీపీఎస్ స్కూల్ విద్యార్థి స్వరూప జవహర్ నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చిన్నబాబు తెలిపారు. ప్రవేశ పరీక్షకు ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా స్వరూప నవోదయలో సీటు సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు స్వరూపను అభినందించారు.

విద్యాసామగ్రి పంపిణీ

టి.నరసాపురం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రీస్కూల్ విద్యను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భూక్యా వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని లంకాలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దారబోయిన వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్‌ను అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎం.జగదంబ, కొల్లిరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కుక్కునూరు : ఇబ్రహీంపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో గురువారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు మాట్లాడుతూ బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, సర్పంచ్ తుర్సం నరేష్, ఉప సర్పంచ్ ఎల్లంకి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం : మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఉప్పలమెట్టలో ప్రజల విద్యుత్ అవసరాల కోసం 40కేవీ ట్రాన్స్‌ఫార్మర్ గతంలో ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రాంతంలో ఓవర్ లోడ్ కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ ఈఈ పి.రాధాకృష్ణ, ఏడీఈ సుబ్బారావు, ఏఈ సునీతలతో కలిసి ఆ ప్రాంతంలో 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు.

విద్యార్థినికి అభినందనలు


సభలో అఖిలను అభినందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విపత్తి అఖిలను అభినందిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన అఖిల చదువులో రాణించడం అభినందనీయమని అన్నారు. ఆమె ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులు కందుల ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయడంలో ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో వ్యవహరించాలి అని కొయ్యలగూడెం మండల స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన డీఈవో ఎస్‌వీ రవిశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.బేబీశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి పథకాలు అందని వారి జాబితా సేకరించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారుల బృందాలు విడతల వారీగా మండల వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించాల్సిందిగా సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాశం నాగమణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని కలెక్టర్ సూచనలను తీసుకున్నారు. స్పెషల్ ఆఫీసర్ హోదాలో మండలానికి తొలిసారిగా విచ్చేసిన ఆయనను ఎమ్మార్సీలో ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయుల బృందం కలుసుకొని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఈవోను శాలువా కప్పి సత్కరించారు.


కొయ్యలగూడెం : మాట్లాడుతున్న డీఈఓ రవి శేఖర్

అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

టి.నరసాపురం : ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి పోలవరం ప్రాజెక్టు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సూర్యనారాయణ రెడ్డి అన్నారు. టి.నరసాపురం మండల ప్రత్యేక అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులకు జగనన్న సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎంపీడీవో బీఎస్ఎల్ మంగాకుమారి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.


టి.నరసాపురం : అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి

జగనన్న సురక్షపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి

పోలవరం రూరల్ : జగనన్న సురక్ష పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పోలవరం మండల ప్రత్యేకాధికారి, ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఆయన గురువారం పోలవరం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఎంపీడీవో జి.శ్రీను, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డిలు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ తరువాత వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పట్టిన్నపాలెం, శ్రీనివాసపురం, మైసన్నగూడెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోల్నాటి శ్రీనివాసరావు, పారేపల్లి నాగేంద్ర, పసుపులేటి రత్నకుమారి, ఎంఎల్‌వో రాజా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను ప్రజలకి చేరువ చేయాలి

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి, అర్హులైన ప్రజలకు లబ్ధి చేకూర్చాలని చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు, గృహ సారథులకు అవగాహన కల్పించే కార్యక్రమం గురువారం చింతలపూడి ఆర్‌బీకేలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ రాంబాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


చింతలపూడి : సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు

అర్హులకు న్యాయం చేకూర్చేందుకు..

అర్హత ఉండి ఇంకా ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకుండా ఉంటే వారికి న్యాయం చేసేలా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి రవికుమార్ అన్నారు. చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం 21 సచివాలయాల పరిధిలో శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

అధికారుల తీరుపై మండిపాటు

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం శుక్రవారం నుంచి అమలు చేయనున్న జగనన్న సురక్ష పథకంపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలకు మండల పరిషత్ అధికారులు సమాచారం అందించారు. అయితే 12 గంటలకు కూడా అధికారులు హాజరు కాకపోవడంతో సమావేశం నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహంతో వెళ్లిపోయారు. సమావేశం నిర్వహించవలసిన ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి కూడా ఆలస్యంగా రావడంతో వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, ఉయికే బొజ్జి, ఎంపీటీసీ గాలి దుర్గారావు ఆయన్ను గట్టిగా నిలదీశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన తహసీల్దార్ శారా శాంతి వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. శుక్రవారం సాయంత్రం 3 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి అందరూ హాజరయ్యేలా చేస్తానని చెప్పడంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు శాంతించారు.


ఎంపీడీఓతో ప్రజాప్రతినిధుల వాగ్వివాదం

ధృతరాష్ట్రుని కౌగిలిలో పవన్ కళ్యాణ్


రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు

కొయ్యలగూడెం : ధృతరాష్ట్రుడు వంటి చంద్రబాబు కౌగిలిలో పవన్ కళ్యాణ్ ఉన్నాడని ఆయన్ని ఎవరూ రక్షించలేరని రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు పేర్కొన్నారు. గురువారం కొయ్యలగూడెంలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఇప్పటివరకు ఎంతటి మేధావి అయినా రాజకీయంగా ఎదగలేదని అన్నారు. ఆయనను దాటి వెళుతున్నారనే అనుమానం వస్తేనే చాలు చంద్రబాబు ఎటువంటి నీచానికైనా, దారుణానికైనా పాల్పడతారన్నారు. చంద్రబాబుతో సమానంగా టీడీపీలో ఎదుగుతూ వచ్చిన స్వర్గీయ లోక్‌సభ మాజీ స్పీకర్ జి. బాలయోగి, ఎలిమినేటి మాధవరెడ్డి, కింజరపు ఎర్రంనాయుడు, ఇలా ఎందరో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారని ఆ ప్రమాదాల వెనుక కుట్ర కోణాలు దాగున్నాయని ఆరోపించారు. మిడి మిడి రాజకీయ పరిజ్ఞానంతో ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయ రాబందు వంటి చంద్రబాబు కౌగిలిలో నలిగిపోతాడని జోస్యం పలికారు. చంద్రబాబు అంటే వెన్నుపోటుకి, మోసానికి, అవినీతికి, వంచనకు, ద్రోహానికి మరో రూపం అని అన్నారు. భవిష్యత్తులో ప్రజలు తమ పిల్లలకు రాజశేఖర్ అనే పేరు, జగన్ అనే పేర్లు పెట్టుకుంటారే కానీ చంద్రబాబు పేరుని మాత్రం పెట్టుకోరు అంటూ ఎద్దేవా చేశారు.

ప్రమోద్‌కుమారికి సత్కారం

పోలవరం రూరల్ : పోలవరం ఐసీడీఎస్ పీవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన పీవో ఎంబీఎస్ ప్రమోద్‌కుమారిని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం సన్మానించారు. పోలవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెను సన్మానించి, చేసిన సేవలను కొనియాడారు. ఎంబీఎస్ ప్రమోద్ కుమారి బదిలీపై తణుకు వెళ్లారు.

జగన్ పాలనలో ప్రజా సంక్షేమమే లక్ష్యం


జీలుగుమిల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లల్లో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ప్రతి గడపకూ వెళ్లినపుడు ప్రజలు ఎంతో సంతోషంగా స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, దానికి అనుసంధానంగా జగనన్న సురక్ష పథకం ప్రవేశ పెట్టారని తెలిపారు. ఈ పథకంలో నెల రోజుల పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కె. పోశమ్మ, సర్పంచ్ సోయం కాంతమ్మ, ఉప సర్పంచ్ శ్యామలా శరణ్య, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, బోదా శ్రీనివాసరెడ్డి, గంటసాల గాంధీ, జేసీఎస్ కన్వీనర్ వనమా రామకృష్ణ, పార్టీ నాయకులు గూడవల్లి శ్రీనివాస్, చందా ప్రసాద్, సూరిశెట్టి ఏసుబాబు, చిట్టిబొమ్మ శ్రీను, శ్యామల సుబ్బారెడ్డి, కెక్కిరాల రాము, కెక్కిరాల చక్రి, వంకాయల నాగేశ్వరరావు, సూరిశెట్టి శ్రీను, కుమ్మసాని వెంకటరెడ్డి, మొడియం బాబూరావు, మోటేపల్లి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సున్నం సురేష్, సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వి.చంద్రశేఖర్, ఏఓ మంగతయారు, సచివాలయ సిబ్బంది వలంటీర్‌లు పాల్గొన్నారు.

రూ. 21.06 కోట్లతో 391 అభివృద్ధి పనులు పూర్తి

మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


విలేకరులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం : జగనన్న ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జంగారెడ్డిగూడెం పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.21.06 కోట్లు వెచ్చించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొత్తం 391 అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. 2019–2023 వరకు సాధారణ నిధులు రూ.7,19,96,512 వెచ్చించి 219 అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.12,50,71,518 వెచ్చించి 160 అభివృద్ధి పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1,05,87,041 వెచ్చించి 7 అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30,09,538 వెచ్చించి 5 అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. దీనిలో సాధారణ నిధులు 2019 – 20వ సంవత్సరంలో రూ. 48.80లక్షలు, 2020–21లో రూ.70.06 లక్షలు, 2021–22లో రూ.2.94కోట్లు, 2022–23లో 1.11 కోట్లు, 2023 – 24లో 1.95 కోట్లతో రూ. 219 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధులు 2019–20లో రూ.7.09లక్షలు, 2020–21లో రూ. 3.78 కోట్లు, 2021–22లో రూ. 4.37 కోట్లు, 2022–23లో రూ. 4.28 కోట్లు అభివృద్ధి పనులకు వెచ్చించామన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2022–23లో రూ.75.31 లక్షలు, 2023–24లో రూ.30.56 లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కాగా గడపగడపకు మన ప్రభుత్వానికి సంబంధించి 2023–24 సంవత్సరంలో 5 పనులు పూర్తిచేశామని, దీనికి రూ. 30.09 లక్షలు వెచ్చించినట్లు ఆమె తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ కంచర్ల వాసవీరత్నం, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

ద్వారకాతిరుమల : పిల్లలు, పసిబిడ్డలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు తప్పవని ఒక యాచకురాలిని ఎస్సై టి.సుధీర్ గురువారం హెచ్చరించారు. వివరాలు ప్రకారం. భీమడోలుకు చెందిన యాచకురాలు వీరమ్మ క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద తన పసి బిడ్డతో భిక్షాటన చేస్తోంది. దీన్ని గమనించిన సచివాలయం-2 మహిళా పోలీస్ లక్ష్మీ సుజన 1098 ద్వారా చైల్డ్ లైన్‌కు సమాచారం అందించారు. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పసి బిడ్డతో సహా, ఆ మహిళా యాచకురాలిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎస్సై సుధీర్ ఆ యాచకురాలికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి పిల్లలతో భిక్షాటన చేయిస్తున్నట్టు తన దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించి ఆమెను విడిచిపెట్టారు. ఈ కౌన్సిలింగ్‌లో అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నారు.


కౌన్సిలింగ్ అనంతరం యాచకురాలిని పోలీస్ స్టేషన్ నుంచి బయటకు పంపుతున్న పోలీసులు

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ ఈఈ పి.రాధాకృష్ణ

జంగారెడ్డిగూడెం : నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా నూతనంగా జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ ఈఈగా బాధ్యతలు తీసుకున్న పి.రాధాకృష్ణకు సూచించారు. గురువారం జంగారెడ్డిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను ఈఈ రాధాకృష్ణ మర్యాపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పందు జగదీష్, ఏడీఈ సుబ్బారావు, ఏఈ సునీత తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జంగారెడ్డిగూడెం రూరల్ : పంగిడిగూడెం గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ కుక్కల రామాంజనేయులు కుటుంబాన్ని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా గురువారం రాత్రి పరామర్శించారు. రామాంజనేయులు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే చక్రదేవరపల్లిలో పితృ వియోగం పొందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దండు నాగరాజుని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, పార్టీ నాయకులు కొప్పుల రవిచంద్రారెడ్డి, గంజి వినోద్, గోలి కిషోర్, డాక్టర్ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కొయ్యలగూడెం : ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందజేస్తున్న పథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. గురువారం బయ్యనగూడెం ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం అన్నపూర్ణేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. అలాగే రాజవరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం బి.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు ఏలేటి చిన్న తుక్కయ్య, లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి బుజ్జిబాబు, మాజీ ఎంపీటీసీ తమ్మిర్సి బ్రహ్మన్న, విద్యా కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.


రాజవరంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

ఓటరు నమోదుపై అవగాహన

పోలవరం రూరల్ : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు అందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ బి.సుమతి సూచించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఎలక్షన్స్ స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా మండలంలోని అధికారులకు సమావేశం నిర్వహించారు. 40 పోలింగ్ కేంద్రాల పరిధిలోని అధికారులతో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఫారం 6 ద్వారా కొత్త ఓట్లు నమోదు చేసుకోవచ్చన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రకారం వచ్చే నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటికీ సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో బీఎల్‌వోలు వారి ఓటర్ల పరిధిలోని సర్వే చేసి తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పోలవరం ఈవోపీఆర్‌డీగా శ్రీనివాస్

పోలవరం ఈవోపీఆర్‌డీగా ఈఎస్ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కామవరపుకోట మండలం నుంచి బదిలీపై పోలవరం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఈవోపీఆర్‌డీ నిఖిల్ మధు జీలుగుమిల్లి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కళాశాల అభివృద్ధికి రూ.60 వేలు అందజేత

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు అన్నారు. గురువారం కంతమనేనివారిగూడెం గ్రామానికి చెందిన సింగపూర్‌లో ఉండే ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ ఏషియన్ టెక్నాలజీ సొల్యూషన్స్ చైర్మన్, సీఈవో గోరుముచ్చు గోపాల్ యాదవ్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.60 వేలు అందజేశారు. రానున్న రోజుల్లో కళాశాల అభివృద్ధికి మరిన్ని సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా గోపాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి ఎద్దు మృతి

కుక్కునూరు : సెప్టిక్‌ట్యాంక్ పైకప్పు కూలడంతో ట్యాంక్‌లో ఎద్దు పడి మృతి చెందిన ఘటన గురువారం కుక్కునూరులో చోటుచేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి, కొర్లకుంట గ్రామంలోని మడకం రామారావుకు చెందిన ఎద్దు మేత కోసం కుక్కునూరు పాత సెంటర్‌కు వచ్చింది. ఎద్దు మేత మేసుకుంటూ వెళ్తున్న తరుణంలో సెప్టిక్ ట్యాంక్ పైకి వెళ్లగానే ట్యాంక్ పైభాగం విరిగి ట్యాంక్‌లో ఎద్దు పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి జేసీబీ సాయంతో రెండు గంటలు కష్టపడి ఎద్దును బయటకు తీశారు. అయితే కాసేపటికే గాయాల కారణంగా ఎద్దు మృతి చెందింది.

దౌర్జన్యం చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : ఇంటిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేసిన నేరంపై ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. మైసన్నగూడెంకు చెందిన మోటమర్రి నాగనరేంద్రరావు తల్లి, మరదలు పేర్ల మీద 171/3ఏలో 4 సెంట్ల భూమి ఉందని, 2006లో సదరు భూమికి ఇంటి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. అయితే ఈ భూమి తమది అని పేర్కొంటూ అదే గ్రామానికి చెందిన బోడా నాగేశ్వరరావు, మరో ఆరుగురు కలిసి నాగనరేంద్రరావు ఇంటిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేసి ఇంటి సామాగ్రి బయటకు పడవేసి చంపుతానని బెదిరించారన్నారు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రక్కు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : ఒక వ్యక్తి గాయపడానికి కారణమైన ట్రక్కు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. లక్కవరం గ్రామానికి చెందిన మల్లెల్లి వెంకట్రావు కూలిపని చేసుకుని జీవిస్తున్నాడు. ఈ నెల 21వ తేదీ రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళడానికి ట్రక్కు ఆటో ఎక్కుడు. అయితే లోడుతో ఉన్న ట్రక్కు ఆటోను డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఆటో తిరగబడిందని, ఈ ఘటనలో వెంకట్రావుకు కుడివైపు పక్క ఎముకులపై గాయాలయ్యాయి. బాధితుని కుమారుడు మల్లెల్లి కిషోర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.